- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి, నెల రోజులు దాటినా పట్టించుకోని వైనం

భృతినివ్వు.. బాబూ



సాక్షి, నెట్‌వర్క్ : ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని వాగ్దానం చేసింది. ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటినా ఇంత వరకు ఈ పథకం అమలుకు నోచుకోలేదు. డీఎస్సీ తప్ప మిగతా ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయలేదు. దీంతో జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవానికి 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్ల వరకు ఆ ఊసే లేదు. చివరి సంవత్సరంలో రూ.2 వేల చొప్పున కొందరికి మాత్రమే నిరుద్యోగ భృతి చెల్లించారు. మునుపటి అనుభవాలను గుర్తు చేసుకుంటున్న నిరుద్యోగులు మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడు కరుణిస్తారో...!



మాది కడప నబీకోట. నేను 2019లో డిగ్రీ పూర్తి చేశాను. నా అర్హతకు సంబంధించి అన్ని పోటీ పరీక్షలను రాస్తున్నాను. ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం లేదు. లేడీస్ కార్నర్‌ను పెట్టుకున్నాను. సీఎం చంద్రబాబు ఎప్పుడు కరుణిస్తారో.. నిరుద్యోగ భృతిని ఎప్పుడు కల్పిస్తారోనని ఎదురు చూస్తున్నాం.

- చెన్నూరు ప్రత్యూష, నబీకోట, కడప

నిరుద్యోగ భృతి ప్రకటించాలి



కూటమి నేతల ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. అధికారంలోకి వస్తే ప్రతి నెల రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు కావస్తున్నా నిరుద్యోగ భృతి పై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయాలి. అలాగే నిరుద్యోగుల వయో పరిమితి కూడా సడలించాలి.

-కె. నాగ భూషణం, పెద్దచెప్పలి, కమలాపురం మండలం

ప్రతి హామీని అమలు చేయాలి

టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం లేకపోతే నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. వెంటనే అమలు చేయాలి. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

- ఓబులేసు, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు

ఆ ఊసే ఎత్తడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు మగిసింది. కానీ ఇంత వరకు నిరుద్యోగ భృతి చెల్లింపునకు సంబంధించి ఊసే ఎత్తలేదు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి చెల్లింపునకు సంబంధించిన విధి, విధానాలు ప్రభుత్వం ప్రకటించాలి. ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సాయంగా భృతి చెల్లిస్తే వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుంది.

- పి. చిన్న, డిగ్రీ విద్యార్థి, వల్లూరు

ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి. లేదంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. డిగ్రీలు చేసి ఉద్యోగాలు లేక కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఈ ప్రభుత్వంలో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి వస్తుందన్న ఆశ ఉంది. ఏదో ఒకటి వస్తే మా కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటుంది.

- ఎం. రవి, నిరుద్యోగి, కడప

స్పష్టమైన ప్రకటన చేయాలి

టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి అమలు చేస్తామన్నారు. వెంటనే నిరుద్యోగులకు స్పష్టత ఇవ్వాలి. ఆరు గ్యారంటీ పథకాలు పేరుతో ప్రజలకు హామీ ఇచ్చారు. ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

- డేవిడ్‌రాజ్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు

కడప నియోజకవర్గంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు అత్యధికంగా ఉన్నారు. బీపీఎల్ పరిధిలో 83,791 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు చెందిన విద్యార్థులంతా నిరుద్యోగ భృతికి అర్హులే. దాదాపు 40 వేల మందికి నిరుద్యోగ భృతి దక్కాల్సిన పరిస్థితి ఉంది.

ఎంబీఏ వరకు చదివాను



మాది కడప నగరం అక్కాయపల్లి. నేను 2017లో డిగ్రీ, 2019లో ఏంబిఏ పూర్తి చేశాను. అప్పటి నుంచి ఇప్పటి దాకా ప్రైవేట్‌గా మార్కెట్ రంగంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాను. ఎప్పటి వరకు పనిచేస్తానో లేదో తెలీదు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు నిరుద్యోగ భృతిని ఇస్తారనీ తెలిపారు. ఇంత వరకు ఇవ్వలేదు. ఇస్తారనీ ఎదురు చూస్తున్నాను.

- నితీష్, అక్కాయపల్లి, కడప

మాట నిలబెట్టుకోవాలి

ఎన్నికల హామీల్లో చంద్రబాబు నిరుద్యోగ భృతిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నేను 2017, 2019లో రెండు సార్లు డీఎస్సీ పరీక్ష రాశాను. **- కొండెపోగుబాలరాజు, ముద్దంవారిపల్లె, కలసపాడు మండలం**

'తల్లికి వందనం' పేరుతో ప్రభుత్వం దగా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

- జగన్‌పై తప్పుడు కేసు నమోదు దారుణం
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : 'తల్లికి వందనం' పేరుతో కూటమి ప్రభుత్వం పిల్లలను, తల్లులను దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ. 15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ప్రచారం ఆర్భాటంగా ప్రచారం చేసి కూటమి.. నేడు అధికారంలోకి వచ్చాక హామీని విస్మరిస్తోందని మండిపడ్డారు. ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న ప్రభుత్వం ప్రతి ఏటా జూన్ మాసంలోనే అమ్మ ఒడిని క్రమం తప్పకుండా తల్లుల ఖాతాలో జమ చేశామని గుర్తుచేశారు. 2019–20లో జనవరి 9న 81,72,244 మంది విద్యార్థులకు రూ.6349.6కోట్లు, 2020–21లో జనవరి 11న 83,76,020 మందికి రూ.6673.4కోట్లు, 2021–22లో జూన్ 27న 82,06,302 మందికి రూ.6393.6కోట్లు, 2022–23లో జూన్ 28న 83,15,341 మందికి రూ.6392.94 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసిందని గుర్తుచేశారు. అలాగే సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు, రైతులకు రూ.20 వేలు, నిరుద్యోగ భృతి తదితర పథకాలన్నీ అమలు చేయాలన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కేసు నమోదు దారుణం

ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు మెయిల్ ద్వారా చేసిన ఫిర్యాదు ఆధారంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం దారుణం అని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆక్షేపించారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్న కేశవరెడ్డి, వంశీధర్‌రెడ్డి, కొండారెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని చెర్లోపల్లిలో వైస్సార్‌సీపీ నాయకులు ఇంటి స్థలాలను కబ్జా చేసినట్లు ఒక పత్రికలో వచ్చిన కథనాలు అవాస్తవమని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ వర్దిరెడ్డి సురేంద్రరెడ్డి కొట్టిపారేశారు. సోమవారం వారు కడప నగరంలోని వైస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెర్లోపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా కబ్జాలు చేయలేదని, అసత్య ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. గతేడాది మండల సర్వసభ్య సమావేశంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు తీర్మానం చేసి ఆ పత్రాన్ని ఎంపీడీఓకు, కడప మున్సిపల్ కమిషనర్‌కు అందజేశామని గుర్తుచేశారు. కథనాలు రాసేముందు నిజాలు తెలుసుకుని రాస్తే మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుడా ప్రభాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని కడప రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కమిటీ సభ్యులతో స్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్, కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ సోమవారం కడప రైల్వేస్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కమిటీ ప్రతినిధుల వినతులను నమోదు చేసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే ప్రయాణికులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా చూస్తామన్నారు. రైల్వే ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

దుర్గాబాయి సేవలు మరువలేనివి



దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ అందించిన సేవలు మరువలేనివని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు పేర్కొన్నారు. సోమవారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్కే సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా మహిళల సమస్యల కోసం ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. ఆమెను నేటి బాలికలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధ్యక్షుడు రాయల్ కరీముల్లా, ఉర్దూ అధ్యాపకులు, సయ్యద్‌అంజద్ అలీ, అధ్యాపకులు శ్రీవాణి, హేమలత, తాజబేగం, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

వల్లూరు: వల్లూరు మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. పాఠశాలకు చెందిన వై. వర్షిత, డి. అక్షిత, జి. వెంకట సాయి, ఎస్ పూజ శ్రీ, ఎస్. హర్షవర్ధన్, పి. సాహితి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : కొండాపురం డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని అదే మండలం కె.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన పి.చెన్నారెడ్డి సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. తనకు సర్వహక్కులు ఉన్న 33 సెంట్ల భూమిని రాజేశ్వరి ఆర్ఐగా పని చేస్తున్న సమయంలో రికార్డులు తారుమారు చేసి పుల్లయ్య, బి.వెంకట కృష్ణారెడ్డి పేర్లతో ఆన్‌లైన్ చేసి తన అత్త పేరుపై రిజిస్టర్ చేయించుకుందని ఆరోపించారు. దీనిపై జమ్మలమడుగు డీఎస్పీని ఆశ్రయించగా రికార్డులు పరిశీలించి డీటీ రాజేశ్వరిపై కేసు నమోదు చేయాలని త్రాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐని ఆదేశించారన్నారు. అప్పటి తహసీల్దార్ ప్రభాకర్‌రెడ్డి, డీటీ రాజేశ్వరి, మరో ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. కనుక డీటీపై చర్యలు తీసుకుని తన భూమి తనకు ఇప్పించాలని కోరారు.

విద్యార్థి వాసంతి మృతి కారకులను శిక్షించాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో విద్యార్థిని వాసంతిని కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్‌యూ నగర అధ్యక్షుడు కొండేటి హరిబాబు డిమాండ్ చేశారు. వాసంతి ఆత్మకు శాంతి కలగాలని సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసంతి మృతదేహం ఆచూకీ ఇంత వరకు లభించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, విద్యార్థినుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా వారి పైన దాడులు ఆగడం లేదని పేర్కొన్నారు. నేటి సమాజంలో మైనర్ విద్యార్థులకు సమాజం, చట్టాల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. వాసంతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా సోమవారం ఆ యూనియన్ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడప నగర పరిధిలోని పద్మావతి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు, వృద్ధులకు పండ్లు, పాలు అందజేయడంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ కడప డిపో సెక్రటరీ శ్రీనివాసులు, గ్యారేజ్ కార్యదర్శి మల్లేషు, ప్రెసిడెంట్ రవి, డిపో అసిస్టెంట్ సెక్రటరీ సుబ్బారావు, మహాలక్ష్మి, అమరేశ్వరి, ఆనంద్, శివ యాదవ్, జాయింట్ సెక్రటరీ చంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప రూరల్ : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంతరం అమ్మ అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, వజ్ర రామాంజనేయులు, ఏవీ వెంకటేశ్వర్లు, సీఆర్ఐ సునీల్, కల్యా సుధాకర్, నరసింహా, ఆంజి, గంగయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణి అని కూడా చూడకుండా వేధిస్తున్నారు'

- న్యాయం కోసం ఎస్సీ మహిళ వేడుకోలు

కడప రూరల్ : తాను నిండు గర్భిణివ అని చూడకుండా పోలీసులు కేసును ఉపసంహరించుకోవాలని వేధిస్తున్నారని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె చిన్న ఓరంపాడుకు చెందిన దార్ల సారమ్మ ఆరోపించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన భర్త ఆనందబాబును కృష్ణానగర్‌కు చెందిన ఒక మహిళ ట్రాప్ చేసి రూ.లక్ష తీసుకుని మోసం చేసిందని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని నిండు గర్భిణి అని చూడకుండా తమను వేధిస్తున్నారన్నారు. తన భర్తకు ప్రాణహాని ఉందని, నా కుటుంబాన్ని రక్షించాలని కోరారు. ఉమ్మడి జిల్లా సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు చోడవరం సుబ్బనరసయ్య మాట్లాడుతూ దార్ల సారమ్మకు న్యాయం చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు స్థలం కేటాయించాలి



ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి వినతిపత్రం సమర్పిస్తున్న విగ్రహ కమిటీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో భారత దేశ ప్రథమ స్వతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్ర ఆవిష్కరణకు స్థలాన్ని కేటాయించాలని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యారపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ పెద్దిరెడ్డి గారి పురుషోత్తం రెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం కడపలోని జిల్లా విగ్రహ కమిటీ సభ్యులు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ప్రభాకర్‌నాయుడును తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఆవిష్కరణ అనుమతి కోసం వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు ఆయన అనుకూలంగా స్పందించారని విగ్రహ ఏర్పాటుకు అనుమతితో పాటు స్థలాన్ని కూడా కేటాయిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాలవ శ్రీలతరెడ్డి, నేషనల్ కన్వీనర్ నల్లపురెడ్డి వెంగళరెడ్డి పాల్గొన్నారు.

అందరూ ఒక్కటై.. ఆనందంగా..



రెడ్‌క్రాస్ ఎదురుగా గల మట్టిపెద్దపులి విగ్రహం



నాగరాజుపేటలోని బాదుల్లాసాహెబ్ మకాన్

- మొహర్రం వేడుక... మత సామరస్యానికి వేదిక

కడప కల్చరల్ : మొహర్రం పర్వదినం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ పండుగను జిల్లాలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తారు. అప్పట్లో గ్రామాల్లో ఉండేది కొన్ని ముస్లిం కుటుంబాలే అయినా వారికి హిందువులు తోడై అందరూ కలిసి పండుగను నియమ బద్ధంగా నిర్వహించడం పలు తరాలుగా వస్తున్న ఆనవాయితీ. గ్రామీణ ప్రాంతాల్లో దీన్ని పీర్ల పండుగగా వ్యవహరిస్తారు. నిజానికి ఇది విషాదర భరితమైన రోజు అయినా స్ఫూర్తి కోసం ఉత్సవంలాగా నిర్వహిస్తారు, గనుక వ్యవహారంలో దీన్ని పండుగగానే పిలుస్తున్నారు.

కడప నగరంలో రెండు, మూడు చోట్ల మొహర్రంను వైభవంగా నిర్వహిస్తారు. మొహర్రం నాడు పెద్దదర్గాలో హజరత్ సయ్యద్‌షా పీరుల్లామాలిక్ సాహెబ్ ఉరుసుగా నిర్వహిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక ధార్మిక కార్యక్రమాలు, ఫాతెహా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హజరత్ పీరుల్లామాలిక్ మజార్ ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా ప్రత్యేకంగా తెప్పించే రంగురంగుల అరుదైన పూలతో కళ్లు చెదిరేలా అలంకరిస్తారు.

మట్టిపెద్దపులి

కడప నగరం రెడ్‌క్రాస్ భవనం ఎదురుగా రోడ్డు కూడలిలో గల మట్టిపెద్దపులి విగ్రహానికి ఓ చరిత్ర ఉంది. దీనికి మొహర్రం వేడుకలకు చిన్న సంబంధం ఉంది గనుక ఈ సందర్భంగా దాని గురించి తెలుసుకుందాం. ప్రస్తుతం మట్టి పెద్దపులి విగ్రహం ఉన్న ప్రాంతంలో ఒకప్పుడు తాలింఖానా (వ్యాయామశాల) నిర్వహించే వారు. ఆ చుట్టుపక్కల గల ముస్లిం యువకులతోపాటు హిందు యువకులు కూడా వ్యాయామం చేస్తూ కుస్తీలు పట్టడంతోపాటు సంప్రదాయ యుద్ధ విద్యలు నేర్చుకునేవారు. వీధుల్లో గానీ, గ్రామానికి గానీ అరాచక శక్తుల వల్ల ఏదైనా ఆటంకాలు ఎదురైతే తాలింఖానా నిర్వాహకుల సూచనతో యువకులు వెళ్లి అవసరమైతే శారీరక బలం చూపి ఆ సమస్యను పరిష్కరించేవారు. పులుల లాంటి యువకులు, వారు వ్యాయామం చేసే తాలింఖానాలు ఉండే ప్రదేశం గనుక.. ఆ రోడ్ల కూడలిలో సాహస యువకులకు గుర్తుగా మట్టితో పెద్ద పులి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది రోడ్డు విస్తరణలో దెబ్బతింది. దాన్ని అక్కడి నుంచి తొలగించి మరమ్మతులు చేసి గౌస్‌నగర్ వద్ద డివైడర్‌లో ఏర్పాటు చేశారు. పాత దాని స్థానంలో కొత్తగా సిమెంటు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తాలింఖానాలోని యువకుల ఆధ్వర్యంలో అప్పట్లో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించేవారు. మకాన్ల వద్ద నుంచి పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి వాటిని శుభ్రం చేసి తిరిగి మకాన్లకు చేర్చేవారు. ఊరేగింపులో తాలింఖానాల యువకుల సాహస కృత్యాల ప్రదర్శనలే ప్రధాన ఆకర్షణగా ఉండేవి.

నాగరాజుపేటలో..

నాగరాజుపేటలో బాదుల్లా సాహెబ్ పీర్ల మకాన్ ఉంది. పీర్ల పండుగ సందర్భంగా ఇక్కడ ఘనంగా ఉత్సవాన్ని నిర్వహిస్తారు. మకాన్ సమీపంలో ఎక్కువగా దుకాణాలు ఏర్పాటు చేస్తారు గనుక ఆ ప్రాంతం తిరునాలను తలపిస్తుంది. పలు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ ఉత్సవాలకు హాజరవుతారు. కడప నగర శివార్లలోని అంగడివీధి సమీపంలో గల భాకరాపేట ప్రాంతంలో కూడా ప్రాచీనమైన పీర్ల మకాన్ ఉంది. ఇక్కడ కూడా మొహర్రం సందర్భంగా పీర్ల పండుగను భారీగా నిర్వహిస్తారు. ఎక్కడెక్కడి నుంచో భక్తులు వచ్చి మకాన్‌లోని పీర్లను దర్శించుకుని ఫాతెహా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అగ్నిగుండం ఏర్పాటు చేసి మొక్కులు గల భక్తులు నిప్పులపై నడిచే ఘట్టం ప్రధానాంశంగా చెప్పుకొంటారు.

మత సామరస్యం

1970 వరకు పీర్ల పండుగను కడప నగరంలో కూడా భారీగా నిర్వహించేవారు. నాగరాజుపేట చుట్టుపక్కల వీధులన్నీ హిందూ, ముస్లింలు మొహర్రం కార్యక్రమాలను తమవిగా భావించి భక్తి శ్రద్ధలతో పాల్గొనేవారు. భారీగా ఊరేగింపులు నిర్వహించేవారు. ఇందులో హిందువులు కూడా ముస్లింలతో పోటీపడి కార్యక్రమాలను నిర్వహించేవారు. నేటికీ ఆ సంప్రదాయాన్ని ఆచరిస్తున్నారు. అప్పటి నుంచే నగరం మత సామరస్యానికి మారుపేరుగా నిలుస్తోంది.

హెల్మెట్ ధరించండి .. ప్రమాదాలు నివారించండి



ర్యాలీ నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది, పోలీసులు, పారా లీగల్ వలంటీర్‌లు

కడప అర్బన్ : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, జడ్జి కె.ప్రత్యూషకుమారి ఆదేశాల మేరకు హెల్మెట్ ఉపయోగించాలని, ప్రమాదాలను నివారించాలని ర్యాలీ నిర్వహించారు. కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎర్రముక్కపల్లి సర్కిల్ వరకు, అక్కడి నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పారా లీగల్ వలంటీర్‌లు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రమాద సమయంలో తమ ప్రాణాలను కాపాడే హెల్మెట్ ప్రాధాన్యతను ద్విచక్ర వాహనదారులు గుర్తించాలని వక్తలు తెలిపారు. సోమవారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి సూచనలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా తమను తాము కాపాడుకోవడం ద్వారా సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవచ్చన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ సమయంలో కుటుంబాన్ని గుర్తించుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి



కదిరి ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : వేడినూనె పోయడం వల్ల తీవ్రంగా గాయపడిన అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామానికి చెందిన దళితుడు కదిరి ప్రభాకర్ కుటుంబానికి రూ.10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగి రెండు రోజులవుతున్నా ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసులు జాప్యం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఈ విషయమై అన్నమయ్య జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ, సీఐ రిమ్స్‌కు వచ్చి దాడి చేసిన గజ్జల వెంకట సుబ్బారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ యాక్టు కింద, హత్యాయత్నం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం నిందితుడిని అరెస్ట్ చేశారన్నారు. అత్యంత అమానవీయంగా, కుల దురంహంకారంతో జరిగిన ఈ దాడి పట్ల హోంమంత్రి తక్షణం స్పందించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితునికి తీవ్ర గాయాలు కావడం వల్ల అతని శరీర అవయవాలు సక్రమంగా పనిచేసే పరిస్థితి లేదని, అతనికి న్యాయం జరిగే వరకూ దళిత ఫోరం ముందుండి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఫోరం నాయకుడు బండి రమణ, శ్యాంసన్, శ్రీరాములు పాల్గొన్నారు.